నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | మే 19, 2024 | www.navatelangana.com

మెడికవర్ ఆసుపత్రికి ఆరోగ్యశ్రీ నోటీసులు

- ఆరోగ్య శ్రీ వర్తించినా డబ్బులు వసూలు చేయడం పట్ల సీరియస్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం కింద గుండె ఆపరేషన్ చేయుటకు పిట్ల నారాయణ అనే రోగి దగ్గర ఆసుపత్రి యాజమాన్యం సుమారు 80 వేల రూపాయలు తీసుకొని చికిత్స చేసినట్టు ఫిర్యాదు మేరకు ఆరోగ్య శ్రీ అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా పూర్తిగా ఉచిత వైద్యం అందించాల్సింది పోయి డబ్బులు వసూలు చేయడం పైన నోటీసులు అందజేసినట్టు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కె స్వప్న తెలిపారు. అంతేకాకుండా రోగికి సకాలంలో వైద్యం అందించకపోవడంతో మృతిచెందడం పట్ల విచారణ చేపట్టినట్టు తెలిపారు. విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

ఫూడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

- శాంపిల్స్ సేకరించి టెస్టుల కోసం హైదరాబాద్‌కు తరలింపు

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి పట్టణంలోని వివిధ ప్రధాన రహదారిలో ఉన్నటువంటి స్వీట్ హోమ్స్ ను ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిసరాలను, వస్తు సామాగ్రిని, ప్యాక్డ్ మెటీరియల్స్ ఎక్స్‌పెయిరీ డేట్‌ను పరిశీలించి పెనాల్టీలు విధించారు. అక్కడ వివిధ రకాల వస్తువుల శాంపిల్స్ సేకరించి హైదరాబాదులోని ల్యాబ్ కు టెస్టింగ్ కోసం పంపారు. ఈ తనిఖీలో ఫుడ్ ఇన్స్‌పెక్టర్ డాక్టర్ శిరీష మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలంటే లెక్కే లేదు

- పలు ప్రయివేటు ఆస్పత్రుల తీరు వివాదాస్పదం
- డబ్బులతో పాటు ప్రాణాలూ పోతున్న వైనం
- చర్యలు తీసుకునేందుకు అధికారుల వెనుకడుగు
- ఇష్టారాజ్యంగా పలు ప్రయివేటు ఆస్పత్రుల తీరు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో పలు ప్రయివేటు ఆసుపత్రుల తీరు వివాదాస్పదమవుతుంది. సేవా వృత్తితో వైద్య సాయం అందించాల్సిన చోట.. డబ్బులు గుంజడమే పరమావదిగా మారింది. నలతకు గురైనా పదుల సంఖ్యలో టెస్టులు రాసి వేలాది రూపాయలు గుంజుతూ రోగులను ముప్పతిప్పలు పెడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయివేటు ఆస్పత్రికి వెళ్తే ఇక అంతే సంగతులు. అటు పైసలతో పాటు ఇటు ప్రాణాలూ పోతున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలో పలు ఘటనలు చోటుచేసుకోవడం పట్ల ప్రయివేటు ఆస్పత్రుల తీరు వివాదాస్పదంగా మారుతోంది. వేలాది నుంచి లక్షలాది రూపాయలు ఫీజు వసూలు చేస్తూనే.. సకాలంలో సరైన వైద్యం అందించడంలో విఫలమవు తుండటంతో రోగుల ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంత జరుగుతున్నా.. సదరు ఆస్పత్రులపై, వైద్యులపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది.

గడువు ముగిసిన ఇంజక్షన్‌తో 10 నెలల బాబు మృతి..

ధర్పల్లి మండలానికి చెందిన దీక్షిత్ 10 నెలల బాబుకు కాలం చెల్లిన ఇంజెక్షన్ ఇవ్వడంతోనే మరణించాడు. దీక్షిత అస్వస్థతకు గురికావడంతో నగరంలోని ఖలీల్వాడీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఐదు రోజుల వైద్యం తర్వాతా బాలుడి ఆరోగ్యం మెరుగైంది. తీరా డిచ్చార్జి చేసే సమయంలో ఓ ఇంజక్షన్ ఇచ్చారు. ఆ తర్వాత బాలుడు ఒక్కసారిగా అస్వస్థకు గురికవడంతో మెరుగైనా చికిత్స కోసం ఆస్పత్రి వైద్యుడు సూచన మేరకు హైదరాబాద్ తరలించారు. తరలించే సమయంలో బాలుడు మృతి చెందాడు. తీరా కుటుంబీకులకు అనుమానం వచ్చి ఇంజక్షన్ గురించి ఆరా తీయగా ఈ ఏడాది ఫిబ్రవరిలోనే గడువు ముగిసిన్నట్లు గుర్తించారు.

గర్భిణీ మృతి..

ఇటీవల ఓ గర్భిణి సైతం వైద్యుల నిర్లక్ష్యంతో మృతిచెందినట్టు బాధిత కుటుంబీకులు ఆందోళన సైతం చేపట్టారు. కాగా గర్భిణి మృతికి వెల కట్టి రూ.10 లక్షల చెక్కు అందజేయడం కొసమెరుపు. పది లక్షలతో పోయిన ప్రాణం తీసుకురాగలరా అని కుటుంబీకులు ప్రశ్నిస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని వీక్లీ మార్కెట్ వైపు వెళ్లే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కాలుర్ గ్రామానికి చెందిన కంఠం స్రవంతి (35) రెండవ సారి గర్భం దాల్చిన తర్వాత 4 నెల లో ప్రైవేట్ ఆసుపత్రిని నెలవారి (మంత్లి చెకప్) కోసం సంప్రదించగా, డాక్టర్లు పరీక్షలు చేసిన అనంతరం లోపల ఉన్న శిశువు కి శ్వాస, హార్ట్ బీట్ సక్రమంగా లేవని, అందుకు అబార్షన్ చేయవలసి వస్తుందని, మందులు తీసుకుని వెళ్లి ఇంటి వద్ద వేసుకోండి అని డాక్టర్ సలహా ఇచ్చాడు. బాధితులు మందులను తీసుకొని ఇంటికి వెళ్లారు. మందు గోలీలను ఇంటికి వెళ్ళిన తరువాత వేసుకొనగా రక్తస్రావం కావడంతో, ఆసుపత్రి వైద్యులను ఫోన్ లో సంప్రదించగా ఎటువంటి ఇబ్బంది లేదు అని, అబార్షన్ పూర్తి అవుతుందని సలహా ఇచ్చారు. అయినను గర్భిణీ పరిస్థితి క్షీణించడంతో ఆదివారం ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆపాటికి గర్భిణీ పరిస్థితి మరింత జఠిలంగా మారడంతో, వేరే ప్రైవేట్ హాస్పిటల్ కి తిసుకు వెళ్ళండి అని ఆస్పత్రి యాజమాన్యం పంపించడం గమనార్హం. మరో ప్రైవేట్ ఆస్పత్రిని సంప్రదించగా అప్పటికే గర్భిణి మృతి చెందింది అని తెలిపారు.

తాజాగా యువకుడు..

కాగా తాజాగా గురువారం యువకుడికి సకాలంలో వైద్య అందక మృతిచెందడం.. ప్రయివేటు ఆస్పత్రుల ధనదాహానికి నిదర్శంగా నిలిచింది. నవీపేట్ మండలం నిజాంపూర్ గ్రామానికి చెందిన పిట్ల నారాయణకు ఛాతిలో నెప్పి రావడంతో నగరంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలోని ఓ కార్పోరేట్ ఆస్పత్రికి ఈ నెల 8వ తేదీనా చికిత్స నిమిత్తం తరలించారు. ఆరోగ్య శ్రీ కింద ఆపరేషన్ చేసే అవకాశం ఉన్నా. అదనంగా రూ. 80 వేలు వసూలు చేశారు. 8వ తేదీన అడ్మిట్ అయితే.. ఏకంగా 16వ తేదీన ఆపరేషన్ చేయడం గమనార్హం. సకాలంలో ఆపరేషన్ చేయకపోవడంతో యువకుడు మృతిచెందాడు. ఆరోగ్య శ్రీ కింద ఆపరేషన్ చేసినా అదనంగా రూ.80 వేలు వసూలు చేయడం గమనార్హం. ప్రయివేటు ఆస్పత్రుల దందాకు ఇదో ఉదాహరణ.

డాక్టర్ చూడకముందే టెస్టులు

పలు ఆస్పత్రుల తీరు వివాదాస్పదంగా మారుతుంది. నాడి పట్టకముంటే వేలాది రూపాయలతో పదుల సంఖ్యలో టెస్టులు రాస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారు. గతంలో ల్యాబ్‌లు, ఫార్మసీలు వేరే చోట ఉంటుండగా.. ప్రస్తుతం ప్రతి ఆస్పత్రిలో డయగ్నోస్టిక్ సెంటర్‌లు, ఫార్మసీలు ఏర్పాటు చేసుకుంటూ.. ఇష్టానుసారంగా టెస్టులు, మందులు రాస్తూ రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

అయితే ప్రస్తుతం మరో ట్రెండ్ అమలవుతుంది. ఆస్పత్రికి వెళ్లిన పేషెంట్‌లను ముందుగా ప్రధాన వైద్యుడు కాకుండా.. అక్కడే ఉన్న వైద్య విద్యార్థులు, ఇతర వైద్యులు చెకప్ చేసి టెస్టులు రాస్తుండటం గమనార్హం. అన్ని రిపోర్టులు వచ్చాక వైద్యుని వద్దకు రోగిని పంపిస్తున్నారు. అసలు ఆ టెస్టులు అవసరమో లేదో కూడా తెలియకుండా.. వచ్చిన రోగి నుంచి డబ్బులు వసూలు చేయడమే పరమావధిగా ఇష్టానుసారంగా టెస్టులు రాస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలకు వెనుకడుగు..

జిల్లా కేంద్రంలో పలు ప్రయివేటు ఆస్పత్రుల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదం అవుతున్నా. వాటిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. వైద్య శాఖ, కలెక్టర్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా.. ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుంది. ప్రయివేటు ఆస్పత్రులు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారి ఆగడాలకు ముకుతాడు వేయాలని, లేకుంటే రోగులను పీడించి డబ్బుల కోసం హింసిస్తూనే ఉంటారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

తడిసిన ధాన్యాన్ని సైతం
మద్దతు ధరతో కొనుగోలు చేయాలి

- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. కురిసిన అకాల వర్షాలకు వరి పంట ధాన్యం తడిసిపోయి మొలకలు ఎత్తటంతో రైతంగం తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ఆదుకోవటానికి వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాటట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చినా ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. దీంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఆయన అన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా అకాల వర్షాలకు నష్టపోయిన పంటలను నష్టాన్ని అంచనా వేయటానికి ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన అధికారులను పంపే సర్వే చేసి నష్టపరిహారాన్ని చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తాత్సారం చేస్తే రైతాంగం తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి వేడుకలు

నవతెలంగాణ-పిట్లం



పూజలు చేస్తున్న మహిళలు

మండల కేంద్రంలోని ఆర్య వైశ్యులు వాసవి మాత జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి ఆర్యవైశ్యలు ఉపవాస దీక్షలతో ఆర్యవైశ్య సంఘంలో వాసవి మాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, మంగళ హారతులు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

సప్లమెంటరీ పరీక్షలు
పకడ్బందీగా నిర్వహించాలి

- ఇంటర్, పదో తరగతి పరీక్షలపై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

ఈ నెల 24 నుండి జూన్ 3 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు, జూన్ 3 నుండి 13 వరకు నిర్వహించనున్న పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్, పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత విభాగాలతో నిర్వహించిన సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24 నుండి జూన్ 3 వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని అన్నారు. ఇట్టి సప్లమెంటరీ పరీక్షలకు 10,511 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందులో మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులు 6,236 కాగా ద్వితీయ సంవత్సరంలో 4,275 మంది విద్యార్థులున్నారని అన్నారు. ఇందుకోసం జిల్లాలో 29 కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్మెంటల్ అధికారిని నియమించామన్నారు. మాల్ ప్రాక్టీస్ ను అరికట్టుటకు 2 ఫ్లైయింగ్ స్క్వాడ్, 2 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

అదేవిధంగా జూన్ 3 నుండి 13 వరకు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగు పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 869 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, ఇందుకోసం కామారెడ్డి, బాన్సువాడ మండల కేంద్రాలలో ఒక్కో కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నామని కలెక్టర్ తెలిపారు. రెండు కేంద్రాలకు చీఫ్ సూపెరింటెండెంట్లను, డిపార్ట్మెంటల్ అధికారులను, రూట్ అధికారిని, కస్టోడియన్లను, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని, మెడికల్ కిట్లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లతో ఏ.యెన్.ఎం లను అందుబాటులో ఉంచాలని, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలు చేరుకునేలా వివిధ రూట్లలో ఉదయం వేళలో బస్సులు నడపాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కు సూచించారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలు మూసివేయించాలని రెవెన్యూ అధికారులను, ప్రతి కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలిసు అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాలకు చరవాణి లు అనుమతి లేదని, ఒక్క నిముషం ఆలస్యమైన పరీక్ష హాలుకు అనుమతించబడదని విద్యార్థులు ఈ విషయాలను గమనించి సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, సభ్యులు శ్రీనాథ్, నాగేశ్వరయ్య, డీఈఓ రాజు, ఇంచార్జి జిల వైద్య ఆరోగ్య శాఖాధికారి చంద్రశేఖర్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర, కలెక్టరేట్ సూపరింటెండెంట్ జ్యోతి, విద్యుత్ శాఖ అధికారి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం పర్యవేక్షించాలి

- ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించాలి
- కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆదేశం
- నవతెలంగాణ కథనం ఎఫెక్ట్.. క్షేత్రస్థాయిలోకి అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి



క్షేత్రస్థాయిలో పరిశీలించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అకాల వర్షాలు పడుతున్నందున తహసీల్దారులు కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని, త్వరితగతిన ధాన్యం మిల్లులకు తరలించే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. శనివారం అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. 'అకాల వర్షాలతో ఆగమవుతున్న రైతన్న' శీర్షికన నవతెలంగాణలో శనివారం కథనం ప్రచురితమైన విషయం విధితమే. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కథనం ద్వారా వెలుగులోకి తీసుకురాగా.. కలెక్టర్ ఆదేశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి ధాన్యం తూకం చేసే మొదలు లోడింగ్, రైస్‌మిల్‌కు తరలింపు, అన్‌లోడింగ్ తదితర వాటిని పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. కోమలంచ, నిజాంసాగర్, మహమ్మద్ నగర్, లింగంపేట తదితర ప్రాంతాలలో వర్షాలు పడుతున్నాయని తాసీల్దార్‌లు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ప్రతిరోజు చర్చిస్తూ లారీలు ఏర్పాటుచేసి మిల్లులకు ధాన్యం తరలించాలని తెలిపారు. ఈ విషయంలో రైతులకు పూర్తి సహకారం అందించాలని, వారికి మనో ధైర్యం కల్పించాలని సూచించారు. సహకార సంఘాల అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద కావలసిన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం తడువకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలు లేకుండా చూడాలన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారిని



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

లారీలు సమకూర్చాలి : అదనపు కలెక్టర్

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించి అన్‌లోడ్ చేసేందుకు కావలసిన వాహనాలను జిల్లా రవాణా శాఖ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు సమకూర్చాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లోని జేసీ చాంబర్‌లో శనివారం జిల్లా రవాణా శాఖ అధికారులు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో ధాన్యం రవాణాపై జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతుల ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే లారీలు ఏర్పాటుచేసి రైస్ మిల్లులలో అన్‌లోడ్ చేసే విధంగా సహకరించాలని చెప్పారు. రైస్ మిల్లులలో కావలసిన ఖాళీ స్థలాలను గుర్తించాలని సివిల్ సప్లై అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, ఇంచార్జ్ పౌరసరఫరాల మేనేజర్ నిత్యానందం, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దార్లు, జిల్లా రవాణా శాఖ అధికారులు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.15

మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- అనుకూలంగా చేతులెత్తిన బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు

వతెలంగాణ-ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌పై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. శనివారం మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగగా.. చైర్మన్ కుడుముల సత్యనారాయణకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు చేతులు ఎత్తడంతో ఆయన తన పదవి కోల్పోయారు. ఓటింగ్‌లో తొమ్మిది మంది బిఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. దీనితో చైర్మన్ కుడుముల సత్యనారాయణ పదవి కోల్పోయారు. ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు ఉన్నారు. గత రెండే నెలల క్రితం కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ విషయంపై మున్సిపల్ చైర్మన్ కోర్టులో కేసు వేశారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. శనివారం మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాసంపై అధికారుల సమక్షంలో ఓటింగ్ నిర్వహించారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా కౌన్సిలర్‌లు చేతులెత్తి అవిశ్వాసాన్ని బలపరచడంతో ఆయన పదవి కోల్పోయారు.

మున్సిపల్ చైర్మన్ అవిశ్వాసం కోసం క్యాంపు రాజకీయాలు జరిగాయి. 10 వార్డు కౌన్సిలర్ పద్మ శ్రీకాంత్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించినట్లు సమాచారం. త్వరలోనే పద్మ శ్రీకాంత్ చైర్మన్ అవుతారని కౌన్సిలర్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో మున్సిపల్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ముందు మున్సిపల్ చైర్మన్ పదవి కోల్పోవడంతో కాంగ్రెస్ పార్టీకి పెద్ద దెబ్బ తగిలింది. ఏదేమనప్పటికిని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పై బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం నేపథ్యంలో ఆ పదవి బీఆర్ఎస్‌కు వెళ్లడం గమనార్హం.

రక్తదాతలే ప్రాణదాతలు

- రక్తదాన శిబిరంలో ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్

నవతెలంగాణ-లింగంపేట్



రక్తదాన శిబిరంలో పాల్గొన్న డిఎస్పీ శ్రీనివాస్

కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం పర్మళ్ల గ్రామంలో శ్రీ భక్తాంజనేయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం కామారెడ్డి రక్తదాతల సమూహం ఇంటర్నేషనల్ వైష్ ఫెడరేషన్ (ఐవిఎఫ్) ల ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎల్లారెడ్డి డి ఎస్ పి శ్రీనివాస్ మాట్లాడుతూ గడిచిన 17 సంవత్సరాలుగా కామారెడ్డి రక్తదాతల సమూ హం ఆధ్వర్యంలో ఆపదలో ఉన్న వారికి సకాలం లో రక్తాన్ని అందజేస్తూ, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడమే కాకుండా, రక్తదానం పట్ల అవగాహనను, తల సేమియా వ్యాధి చిన్నారుల కోసం ఇలాంటి మెగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కామారెడ్డి రక్తదాతల సమూహ సేవలు తెలంగాణ రాష్ట్రాకే ఆదర్శమని అన్నారు.

చిన్న గ్రామమైన ఆదర్శంతో ముందుకు వచ్చి 78 యూనిట్ల రక్తాన్ని అందజేయడం గ్రామ యువతకు సామాజిక సేవ పట్ల ఉన్న బాధ్యతకు నిదర్శనం అన్నారు. రక్తదాన శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన డాక్టర్ పుట్ల అనిల్ కుమార్,రాజా గౌడ్ శ్రీకాంత్ రెడ్డి లను ప్రత్యేకంగా అభినందించారు. రక్తదాతలకు ప్రశంస పత్రాలను జ్యూస్ బాటిల్లను కీ చైన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ సభ్యులు డాక్టర్ బాలు, డాక్టర్ వేదప్రకాష్, గంప ప్రసాద్, జమీల్, ఎర్రం చంద్రశేఖర్, కిరణ్, వెంకటరమణ కొడబోయిన శ్రీనివాస్, బద్ధ పావరాజ్ రాజరాజేశ్వర యూత్,బద్ధ శ్రీనివాస్ ఈర్ల సాయిలు,సిద్ధి రాములు సంజీవరెడ్డి గ్రామస్తులు యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై గుంత.. ఆదమరిస్తే అంతే..

నవతెలంగాణ-మాక్లూర్

నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే రోడ్డు అది. ప్రయాణికులు కొంచెం ఆదమరిస్తే అంతే సంగతి. మండలంలోని అమ్రాద్, ఒడ్యాట్‌పల్లి గ్రామాల మధ్య గల రోడ్డుపై సుమారు ఫీటు లోతు గుంత ఏర్పడింది. అటుగా వెళ్లిన వాహనదారులు పలుమార్లు గుంతలో పడి గాయాల పాలైన ఘటనలున్నాయి. ఈ రోడ్డుపై గుంతను పూడ్చటంలో ప్రజాప్రతినిధులు, అధికారులు అలసత్వం చేస్తున్నారు. వెంటనే రోడ్డుపై గల గుంతలను పూడ్చి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నడిరోడ్డుపై ఏర్పడిన గుంత

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ మండల నాయకులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో ముప్కాల్ మండలం వేంపల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ జక్క రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల నాయకులు నిమ్మ మయూర్ తదితరులున్నారు.


సీఎంను కలిసిన సొసైటీ చైర్మన్

అందుబాటులో టార్పాలిన్లు


సహకార సంఘంలో అందుబాటులో ఉన్న టార్పాలిన్లు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉన్నట్టు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి తెలిపారు. ఒక్క టార్పాలిన్ ధర రూ.1400 మాత్రమేనని వారు తెలిపారు. ఆసక్తిగల రైతులు టార్పాలిన్లను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని మరియా తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంజీవ్‌గారి నానమ్మ మృతిచెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ శనివారం వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధైర్యపడవద్దు అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో చెలిమెల శ్రీనివాస్, మాగిత్యా, దేవీలాల్, రమేష్ నాయక్, గణేష్ నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు సన్మానం


వీడీసీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జంబి హనుమాన్ దేవాలయంలో శనివారం ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులను సన్మానించారు. కొత్తగా ఎన్నికైన గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, ప్రధాన కార్యదర్శి జైడి బాలక్రిష్ణ, కార్యవర్గ సభ్యులను హిందూ ధర్మ పరిరక్షణ సమితి, జంబి హనుమాన్ దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులుగా ఎన్నికైనందుకు అభినందనలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, హిందూ ధర్మ పరిరక్షణ సమితి, జంబి హనుమాన్ దేవాలయం కమిటీ ఉట్నూర్ రాజశేఖర్, రమణయ్య, శంకర్, నరేందర్, అలిశెట్టి అజయ్, సుంకరి మురళి, ఇటుక ప్రసాద్, చంద్ర మోహన్, అడిచర్ల రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో మెగా వైద్య శిబిరం


ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-బోధన్

ఆర్టీసీ ఎం.డీ సజ్జనార్ ఆదేశాల మేరకు శనివారం బోధన్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ 2.0 వైద్య శిబిరంలో ఆర్టీసీ కార్మికులకు, సిబ్బందికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఇందులో భాగంగా ప్రతి ఉద్యోగికి హెల్త్ చెకప్ చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఆర్.ఎం జానీరెడ్డి సందర్శించి ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్, ఎంఎఫ్, సిఐ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కోటలో ఉద్యోగావకాశాలు

నవతెలంగాణ-ముప్కాల్

'యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా' స్పోర్ట్స్ (కబడ్డీ) కోటలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంద్యాల లింగయ్య, కె.గంగాధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న ఉదయం 7గంటలకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేవారు వారి వెంట ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం, స్పోర్ట్స్ కోటాలో పొందిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం ఈ కింది 9989814410 నెంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు

పక్కాగా ఏర్పాట్లు చేయాలి

- **వీడియో కాన్ఫరెన్స్ లో టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ద్వారా జూన్ 9వ తేదీన జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని టీఎస్ పీఎస్సీ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి సూచించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఏర్పాట్ల గురించి, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనల గురించి చైర్మన్ తెలియజేశారు. జూన్ 9వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. అయితే, ప్రిలిమ్స్ పరీక్షకు బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి రెండు గంటల ముందే కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఉదయం 10 గంటల వరకే పరీక్షా కేంద్రంలోనికి వెళ్లేందుకు అనుమతించనున్నట్టు తెలిపారు. అనంతరం గేట్లు మూసివేయాలని స్పష్టం చేశారు. ఈసారి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఇన్విజిలేటర్లతో పాటు బయోమెట్రిక్ క్యాప్చర్ కోసం 160 మంది అభ్యర్థులకు ఒకరు చొప్పున ప్రత్యేకంగా అదనపు ఇన్విజిలేటర్‌లను సైతం నియమించాలని సూచించారు. బయోమెట్రిక్ వేలిముద్రల సేకరణ ప్రక్రియ కోసం పోలీస్ శాఖ సహాయం తీసుకోవాలని, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు నోడల్ పోలీస్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ఎగ్జామ్ ప్యాడ్‌కు అనుమతి ఉండదని, అభ్యర్థులు వాటిని వెంట తెచ్చుకోకూడదని, వీలైనంత వరకు చెప్పులు ధరించి రావాలని హితవు పలికారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డుతో పాటు గుర్తింపు కార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ తీసుకొని రావాలన్నారు. దివ్యాంగులైన అభ్యర్థులు తమకు బదులుగా ఇతరులచే పరీక్ష రాసేందుకు అనుమతి కోరిన చోట, అలాంటివారు ఇంటర్మీడియట్ కంటే తక్కువ విద్యార్హత కలిగిన వారితోనే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని, తమవెంట వైకల్యం ధ్రువీకరించే సర్టిఫికెట్ తేవాలని చైర్మన్ స్పష్టం చేశారు. హాల్‌టికెట్‌లో


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మెన్ మహేందర్‌రెడ్డి

పొందుపర్చబడిన పరీక్షా కేంద్రాన్ని అభ్యర్థులు ముందుగానే వెళ్లి పరిశీలించుకుంటే పరీక్ష రోజున గందరగోళానికి గురయ్యే పరిస్థితి ఉండదని హితవు పలికారు. అభ్యర్థుల సహాయార్థం హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులంతా ఉదయం 9 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పరీక్షా కేంద్రంలోనూ డ్యూయల్ డెస్క్ టేబుళ్లు, పరీక్షా గదుల్లో తగినంత వెలుతురు, సరిపడా లైటింగ్, తాగునీరు, టాయిలెట్ ఇత్యాది వసతులు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచేలా చర్యలు చేపట్టాలని, అన్ని కేంద్రాల వద్ద మహిళా పోలీసు సిబ్బందిని సైతం నియమించాలని అన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితరులకు పరీక్షల నిర్వహణ తీరు, నిబంధనలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు వీలుగా శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ సీ.సీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని, ఈ మేరకు టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అభ్యర్థులు నిబంధనలను తు.చ తప్పకుండా పాటించేలా చూడాలని సూచించారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రశ్నపత్రాలు, ఇతర పరీక్షా సామాగ్రిని పోలీసు బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్ నుంచి ఎగ్జామినేషన్ సెంటర్స్‌కు తరలించాలన్నారు. పరీక్షా కేంద్రంలోనికి ఇతరులు ఎవరినీ అనుమతించకూడదని, పరీక్షా సమయం ప్రారంభం నుంచి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుంచి అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లకూడదని చైర్మన్ స్పష్టం చేశారు. ఎలాంటి పొరపాట్లు, ఆరోపణలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. వీ.సీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ప్రాంతీయ సమన్వయకర్త రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

క్రమశిక్షణతో చదువుకుని

ఉన్నత స్థాయికి ఎదగాలి

- **డివిజన్ అధ్యక్షులు గద్దె గంగాధర్**

నవతెలంగాణ-ఆర్మూర్

చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు గద్దె గంగాధర్ అన్నారు. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘం భవనంలో శనివారం పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు శాలువా, మెమోంటో, సిల్వర్ మెడల్, ప్రశంసాపత్రంతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై భాస్కరాచారి, ఎమ్మార్వో నాగార్జున, జిల్లా అధికారిని పద్మ మాట్లాడుతూ.. పిల్లలు బాగా చదవాలని, మంచి ఉద్యోగం సాధించాలని కోరారు. బాగా చదివి ఉన్నతమైన స్థానంలో ఉండి తల్లిదండ్రుల పేరు నిలపాలని పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వేవా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, ఉప్పల నటరాజ్, రాజారాం, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, వెంకటరమణ, నాగరాజు, గంగాధర్, శివాజీ, రవీంద్ర, శంకర్ వేవా కార్యవర్గ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపాధి డబ్బులు సకాలంలో చెల్లించాలి

- **ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు వెంకయ్యగారి రామ్‌రెడ్డి**

నవతెలంగాణ-ఎడపల్లి

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలందరికీ స్లిప్పులు ఇస్తూ డబ్బులు మంజూరయ్యేలా స్థానిక క్షేత్ర సహాయ సిబ్బంది రమేష్‌తో పాటు, ఉపాధి హామీ ఏపీఓ, కార్యదర్శి సిబ్బంది చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఎంపీటీసీల ఫోరం ఎడపల్లి మండల అధ్యక్షులు వెంకయ్య గారి రామ్‌రెడ్డి అన్నారు. ఉపాధి పనులు చేస్తున్న స్థలాన్ని సందర్శించి కూలీలు చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు. జాబ్‌కార్డు కూలీల పేర్లు మస్టర్లు రావడం రాకపోవడం పట్ల ఆయన కొంత ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆయన ఇటీవల జరిగిన మండల సర్వ సమావేశంలో కూడా సభా దృష్టి తెచ్చిన విషయం తెలిసిందే. మండలంలోని ఆయా గ్రామాలలో ఉపాధి కూలి పనులు చేస్తున్న కూలీలందరికీ ఆ శాఖ అధికారులు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కుర్నాపల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ పనితీరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కుర్నాపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న ప్రతి కూలీకి వారం వారం డబ్బులు మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ ఎంపీటీసీ సభ్యులు వెంకయ్య రామ్‌రెడ్డికి వివరించారు. అలాగే ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓ వాణిశ్రీ సైతం పనుల పరిశీలన చేస్తున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ తెలిపారు. ప్రతి కూలీకి చేసిన పనులకుగానూ డబ్బులు అందించడమే తమ లక్ష్యమని వివరించారు.


కూలీలతో కలిసి మాట్లాడుతున్న వెంకయ్యగారి రాంరెడ్డి

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-ముప్కాల్

1998-99 పదోతరగతి బ్యాచ్ 'ముప్కాల్ జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల'కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో సిల్వర్ జూబ్లీ ప్రోగ్రామ్' నిర్వహిస్తున్నట్లు పాఠశాల పూర్వ విద్యార్థులు నవీన్, దిలీప్, భాగ్యలక్ష్మి, వాణి, సంధ్య శనివారం తెలిపారు. కావున 1998-99 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులందరూ సకాలంలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు భాగ్యలక్ష్మి, వాణి, సంధ్య, నవీన్, దత్తు, దిలీప్, కిరణ్, గంగాధర్, పవన్, రహీం, కిషోర్, శ్రీహరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన కిసాన్ కేత్ జిల్లా ఉపాధ్యక్షుడు


సీఎం రేవంత్‌రెడ్డితో కిసాన్ కేత్ జిల్లా ఉపాధ్యక్షులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కిసాన్ కేత్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్ కలిశారు. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి నేతృత్వంలో కిసాన్ కేత్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పడిగెల ప్రవీణ్ శాలువాతో సత్కరించారు.

ఎంసెట్‌లో ధర్మారం గురుకుల విద్యార్థినుల విజయ ఢంకా



నవతెలంగాణ-డిచ్‌పల్లి

శనివారం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం బీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు మంచి ర్యాంకులు సాధించి విజయ ఢంకా మోగించారని కళాశాల ప్రిన్సిపాల్ బి.సంగీత శనివారం తెలిపారు. అగ్రికల్చర్ విభాగంలో కె.స్రవంతి 3,850, ఇంజనీరింగ్ విభాగంలో పి.పూజ 15,383 ర్యాంకులతో కళాశాల టాపర్‌గా నిలిచినట్టు వివరించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సిబ్బంది అభినందించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులు పరిశీలన


పాఠశాలను పరిశీలిస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

జూన్ నుంచి ప్రారంభమయ్యే అమ్మ ఆదర్శ పాఠశాలలలో మరమ్మతు పనులను జిల్లా, మండల స్థాయి అధికారులు పరిశీలించారు. మండలంలోని రెంజల్, దూపల్లి, దండిగుట్ట, కళ్యాపూర్, కూనేపల్లి, బాగేపల్లి పాఠశాలలను శనివారం పంచాయతీరాజ్ డిఈ రాజయ్య, ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్, ఎంపీఓ గౌస్ ఉద్దీన్, మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు, పంచాయతీరాజ్ ఏఈ వినయ్ కుమార్, ఏపీఎం చిన్నయ్య, సీసీలు శివకుమార్, శ్యామల, గ్రామ కార్యదర్శులు రాజేందర్రావు, నవీన్, సిహెచ్ సాయిలు, శివ కృష్ణ, శ్రీకాంత్, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలో 15 కొనుగోలు కేంద్రాలకు గానూ 10 కేంద్రాల్లో కొనుగోలు ముగిసాయని మిగతా 5 కొనుగోలు కేంద్రాలు మాత్రమే కొనసాగుతున్నట్టు మండల రెవెన్యూ అధికారి బిక్షపతి తెలిపారు. మండలంలోని మాగి, వడ్డేపల్లి, సుల్తాన్ నగర్, అచ్చంపేట్, అరెడ్ గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా లారీలను సరఫరా చేయడం జరుగుతుందని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లుకు తరలించే విధంగా చర్యలు చేపట్టినట్టు తెలిఆరు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడొద్దని ఆయన అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు తీరు పరిశీలిస్తున్న దృశ్యం

నవోదయలో సీట్ల పెంపు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో 40 సీట్లకు గాను ఇంకో 40 సీట్ల ఆక్యుపెన్సీ పెంచినట్టు ప్రిన్సిపల్ సత్యవతి తెలిపారు. దానితోపాటు ఈ విద్యా సంవత్సరం నుంచి 11వ తరగతిలో ఎంపీసీ, బైపీసీ కోర్సులను చదివే విద్యార్థులకు అడిషనల్‌గా కంప్యూటర్ సైన్స్, వెబ్ అప్లికేషన్ రెండు కొత్త కోర్సులను జత చేసినట్టు తెలిపారు. ఈ ఆధునిక యుగంలో విద్యార్థులకు ఈ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె తెలిపారు.



చెరువు మట్టి.. సాగుకు మేలు

- నేలకు పుష్టి.. పెరగనున్న భూసారం
- అధిక దిగుబడితో పాటు రైతులకు లాభాలు

నవతెలంగాణ-లింగంపేట్



పొలంలో వేసిన చెరువు నల్లమట్టి

చెరువులో పూడిక తీత పనులు చేపట్టిన తర్వాత వెలువడే నల్లమట్టిని రైతులు తమ పొలాల్లో వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నల్లమట్టిని తమ మడుల్లో వేసుకుంటే దిగుబడి పెరగడంతో పాటు పంటకు మేలు చేకూరే అవకాశం ఉందని దీంతో రైతులు పోటీ పడి మరి నల్లమట్టిని తమ పొలాల్లో వేసుకుంటున్నారు. ప్రస్తుతం ఉపాధి పనుల కింద చెరువులో పూడికతీత పనులు చేపడుతుండగా.. నల్లమట్టిన రైతులు ట్రాక్టర్‌ల ద్వారా తరలించుకుంటూ తమ పొలాల్లో వేసుకుంటున్నారు. రసాయన ఎరువులు వాడే బదులు భూసారం పెరగడానికి పోషక విలువలు పెరగడానికి చెరువులోని నల్ల మట్టి రైతులకు ఎంతో దోహదపడు తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించడంతో చెరువుల మట్టి వేసుకునేందుకు రైతుల ముందుకు వస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో ఎక్కువ శాతం సౌడు, చౌక భూములు, పలుగు భూములు అధికంగా ఉన్నాయి. ఈ భూముల్లో పంటలు వేసిన దిగుబడి రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు పంటలు వేసి రసాయన ఎరువులు వాడిన ఫలితం లేకుండానే పోతుందని ఉద్దేశంతో వ్యవసాయాధికారుల సూచనతో చెరువులోని నల్లమట్టిని పంట పొలాల్లో వేసుకోవడానికి రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. భూములను సారవంతం చేసేందుకు రైతులు గ్రామ సమీపంలోని చెరువులో నల్లమట్టిని పంట పొలంలో వేసుకుంటున్నారు. చెరువులో మట్టి ఒక ట్రాక్టర్ 450 చొప్పున రైతులు చెల్లిస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి ద్వారా రైతులు తమ భూములను సారవంతం చేసుకోవడానికి ట్రాక్టర్ల సాయంతో మట్టిని తరలించుకుంటున్నారు.

రైతులకు దిగుబడి

చెరువులో మట్టి పంట పనులకు వేయడంతో రైతులకు దిగుబడి వస్తుంది. అంతేకాకుండా నీటి శాతం పూర్తిగా చెరువు మట్టిని పంట నేలకు వేయడం వలన ఎన్నో రకాల లాభాలు పొందవచ్చు. నేల సారం పెరుగుతుంది. తద్వారా పంట దిగుబడి పెరుగుతుంది. రైతులకు మేలు జరుగుతుంది. చెరువు మట్టి నేలలో వేసుకోవడం వలన అన్ని రకాల సూక్ష్మ పోషక లోపాలు స్థూల పోషక లోపాలు నివారించ బడతాయి. రసాయానిక ఎరువుల వాడకం తగ్గుతది. పంటకు రోగా నిరోధక శక్తి పెరుగుతుంది. అదే విధంగా చీడ పీడలు, తెగుళ్ల ఉధృతి చాలా వరకు తగ్గుతది. నేలలో తేమను నిల్వ ఉంచే శక్తి పెరుగుతుంది. నీటి వాడకం తగ్గుతుంది. తద్వారా తక్కువ పెట్టుబడి తో నాణ్యమయిన మరియు అధిక దిగుబడి పంటలను పొందవచ్చు. ముఖ్యంగా చౌడు భూములకు ఈ చెరువు మట్టి వేయడం వలన చౌడు గుణం పోయి నేలలో పోషకాలు పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయి. ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. నల్ల మట్టి లేకపోవడం వల్ల ఎకరాకు 10 క్వింటాళ్లు వచ్చేదని దీంతో రైతుకు నష్టం వాటిల్లుతుందని ప్రస్తుతం నల్లమట్టి వేయడం వల్ల రైతులకు అన్ని విధాలుగా లాభదాయకమని రైతులు పేర్కొంటున్నారు.

రెండు సంవత్సరాల వరకు లాభం

నర్సారెడ్డి. ఒంటరిపల్లి



చెరువులోని మట్టిని పొలాల్లో వేయడం వల్ల రెండు సంవత్సరాల వరకు మేలు జరుగుతుంది. పంటలకు అధిక దిగుబడి వస్తుంది. నాకున్న పది ఎకరాలలో నల్ల మట్టి వేశాము. దీని ద్వారా దిగుబడి అధికంగా వస్తుందన్నారు. రసాయన ఎరువులు వాడటం లేదు.

రోగాలు రావు

రాజా గౌడ్. పర్మల్ల రైతు



చెరువు మట్టి వేయడం వల్ల పంట పొలాలకు రోగాలు బారిన పడట్లేవు. ప్రతేడాది నల్లమట్టి వేస్తున్నాను. పంటకు చీడపీడల బెడద లేదు. ఇప్పటివరకు రోగాలు రాలేవు. రైతులకు మేలు జరుగుతుంది. 100 ట్రిప్పుల నల్ల మట్టి కొట్టించా. భూమి సారవంతంగా ఉంది.

మంచినీళ్ల సమస్యను పరిష్కరించాలి

సీపీఐ(ఎం) జిల్లా కోర్ కమిటీ సభ్యుడు మోతిరాం నాయక్



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-గాంధారి

మంచినీళ్ల సమస్యను వెంటనే పరిష్కరించాలి సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కోర్ కమిటీ సభ్యుడు మోతిరాం నాయక్ డిమాండ్ చేశారు. శనివారం గాంధారి మండలం ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బిర్మల్ తండా, సోమారం తండా, కొత్తబాది తండా పలు గ్రామాలలో మంచినీళ్ల సమస్య విపరీతంగా ఉందని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెలలో మంచినీళ్లు దొరకక చాలా ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు ఎన్నికల కోడ్ పేరు చెబుతూ మేమేమి చేయలేని పరిస్థితులు ఉన్నామని చెప్పడం సరికాదని అన్నారు. మనసు ఉంటే మార్గాలు ఎన్నో ఉన్నా కోడ్ పేరు చెప్పి మంచి నీళ్లు అందించకపోవడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. వెంటనే బోర్లు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సోమవారం రోజు ఖాళీ బిందెలతో మండల కార్యాలయం ముందు భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాష్ నాయక్ పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు



లింగంపేట్ మండల కేంద్రంలో ఊరేగింపు

నవతెలంగాణ-లింగంపేట్/కామారెడ్డి/గాంధారి

మండలం కేంద్రంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆర్య వైశ్యులు, వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక జంబి హనుమాన్ ఆలయం నుంచి వైశ్య సంఘం వరకు కలశాల ఊరేగింపు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో వైశ్య సోదరులు, సోదరీమణులు డిజె సప్పుల నడుమ కోలాటలాడుతూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

కామారెడ్డి : పట్టణంలోని, శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీ, పట్టణ యువజన సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం ఘనంగా శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియా చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్యవైశ్య సభ్యులు ఇందుప్రియాను సన్మానించారు. ఇందుప్రియా మాట్లాడుతూ.. గుడికి సంబంధించిన సమస్య ఏదైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్, శివ, కృష్ణమూర్తి, అనుష, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు



గాంధారిలో..

గాంధారి : గాంధారి మండల కేంద్రంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం భవనం నుండి గాంధారి గ్రామంలోని పురవిధులు గుండా అమ్మవారి విగ్రహాన్ని ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సంఘం కార్యవర్గ సభ్యులు ఆర్యవైశ్య కులస్తులు మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తాటిపత్రాలు అందజేత



తాటిపత్రాలు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొల్లపల్లిలో పేద కుటుంబాలకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అటికెల కిషన్ యాదవ్ తాటి పత్రాలను శనివారం అందజేశారు. గత వారం రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు, ఇంటి పైకప్పులు సరిగా లేకపోవడంతో, వర్షపు నీరు ఇండ్లలోకి రావడంతో, పేద కుటుంబాలను ఆదుకొనడానికి కిషన్ యాదవ్ స్పందించి 20 కుటుంబాలకు తాటి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బాలిక కుటుంబాలు కిషన్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గొల్ల భూమయ్య, నర్సింలు, రాజనర్సు, మెరుగు పెద్ద రాజయ్య, రాజేశం, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైశాఖ పూజ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలం లోని పద్మాజివాడి గ్రామంలో శనివారం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖ మాసంలో ప్రతి సంవత్సరం హనుమాన్ ఆలయంలో వైశాఖ మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బెల్లంతో పానకం శనగ పప్పు తయారు చేస్తారు. అనంతరం గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. ఈ పూజను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సెన్సార్ బోర్డు మెంబర్‌కు పరామర్శ

నవతెలంగాణ-లింగంపేట్



రామకృష్ణతో మాట్లాడుతున్న బీబీపాటిల్

సెన్సార్ బోర్డు మెంబర్ రామకృష్ణ గుప్తాను తన స్వగృహంలో శనివారం జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బిబి పాటిల్ పరామర్శించారు. పోలింగ్ ముందు రోజు బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా.. బీబీపాటిల్‌కు ప్రధాన అనుచరుడు అయిన రామకృష్ణ గుప్త గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న బిబి పాటిల్ రామకృష్ణ పరమర్శించి దాడి చేసిన విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

కరెంట్ షాక్‌తో మహిళ మృతి

నవతెలంగాణ-పిట్లం



మృతిచెందిన గిరిజన మహిళ మంజుల

కరెంటు షాకు తగిలి గిరిజన మహిళా మృతి చెందగా మరొకరికి గాయాలైన ఘటన గౌరారం తండాలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గౌరారం తండాకు పొందిన కేతావత్ మంజుల(38) శనివారం ఉదయం అందాజా 11 గంటల సమయంలో తన ఇంటి ముందు బట్టలు పిండి ఇంటి ముందు గల రేకులకు కట్టిన జే వైర్‌పై ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు అప్పటికే అట్టి జే వైర్ కరెంటు సప్లై అయి ఉండి కరెంట్ షాక్ తగలింది. అక్కడే ఉన్నా తన పెద్ద కుమారుడు ప్రదీప్‌కుమార్ ఆమెను కాపాడడానికి ప్రయత్నించగా అతనికి సైతం కరెంట్‌షాక్ తగలింది. వారి ఆర్తనాధాలు విన్న కుటుంబీకులు, స్థానికులు ఘటన స్థలానికి చేరుకొని వాళ్ళిద్దరిని బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మంజుల మృతి చెందిందని, ప్రదీప్‌కి గాయాలై చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మృతురాలి భర్త లక్షిరామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పొరపాట్లు పునరావృతం కావొద్దు

- గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి : టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్
- సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు : కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్

జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం. మహేందర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌లను, సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో గతంలో రెండు సార్లు పొరపాట్లు జరిగాయని, వాటిని పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు.శనివారం హైదరాబాద్ నుంచి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం. మహేందర్‌రెడ్డి ఇతర సభ్యులతో పరీక్ష ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో సమావేశంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా ఎస్పీ సింధు శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా టీఎస్పీఎస్సీ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 563 గ్రూప్-1 పోస్టులకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల చేసిందని, జూన్ 9న ప్రిలిమ్స్ పరీక్ష పకడ్బందీ నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు దాదాపు 4 లక్షలపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, జూన్ 9న ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షను పకడ్బందీగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి పూర్తి చేయాలని అన్నారు.

పరీక్షలు సజావుగా నిర్వహించే దిశగా కలెక్టర్‌లను చీఫ్ కోఆర్డినేటింగ్ అధికారులుగా, అదనపు కలెక్టర్‌లను అదనపు కోఆర్డినేటింగ్ అధికారులుగా నియమిస్తున్నామని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాలలో సంబంధిత అభ్యర్థులకు సరిపడా అవసరమైన మేర వసతులు కల్పించాలని, ఫర్నిచర్ టాయిలెట్స్, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చూడాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి వచ్చే మహిళా, పురుష అభ్యర్థులను తనిఖీ చేయుటకు పోలీస్ శాఖ ద్వారా తగిన ఏర్పాట్లు చేయాలనీ, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఒక రోజు ముందుగా వెళ్లి పరీక్షా కేంద్రాన్ని ధృవీకరించుకోవాలని, బయో మెట్రిక్ హాజరు నమోదు దృష్ట్యా 9 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, అభ్యర్థులు రెండు గంటల ముందుగా వచ్చే విధంగా చూసుకోవాలని, ఎట్టి పరిస్థతుల్లో 10 తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని, అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డుతో పాటు గుర్తింపుకార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ తీసుకొని రావాలని తెలిపారు.

ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రశ్నపత్రాల తరలింపు పోలీసుల పర్యవేక్షణలో జరగాలని, ప్రతి అంశం సీసీ కెమెరాలు రికార్డు అయ్యే విధంగా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. జిల్లాలలోని పరీక్ష కేంద్రాలకు ఇంచార్జీలను నియమించాలని, జిల్లా అధికారులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ సిద్ధం చేయాలని, పరీక్ష నిర్వహణకు అవసరమైన మేర సిబ్బందిని నియమించాలని కలెక్టర్‌లకు సూచించారు. అభ్యర్థుల అవసరాల మేరకు అదనపు బస్సులు ఆ రోడ్డులలో నడిపే విధంగా ఆర్టిసి అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పత్రాల తరలింపు సమయంలో పోలీస్ బందోబస్తు ఉండాలని, ప్రశ్న పత్రాల, ఓఎంఆర్ షీట్‌లో భద్రతకు స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో 4792 మంది అభ్యర్థుల కోసం 12 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని, సిసి కెమెరాల ఏర్పాటుతో పాటు, పరీక్ష సజావుగా నిర్వహించేందుకు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, బయోమెట్రిక్ యంత్రాలు 1 రోజు ముందు జిల్లాకు వస్తే పరీక్షించి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

రైతులకు అందుబాటులో డ్రోన్

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఉత్నూర్ ప్రాథమిక సహాకార సంఘం రైతులకు అందుబాటులో డ్రోన్ సౌకర్యం ఉందని చైర్మన్ ఖట్మాండి ప్రబాకర్ రావు శనివారం తెలిపారు. ఈ సొసైటీ పరిధిలోని రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. డ్రోన్ ద్వారా పంటలకు పిచికారీ చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సి.ఈ.ఓ నహిమోద్దిన్, వి.డి.సి చైర్మన్ దొడ్లే రవీందర్ రావు కయ్యల రవి ,ప్రశాంత్ ,శివాజీ రావు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని నాగిరెడ్డిపేట్ గ్రామానికి చెందిన మతమాల సిద్ధిరాములు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. యూనియన్ బ్యాంక్ ఏటీఎం ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన రెండు లక్షల చెక్కును అతని భార్య నాగమణికి శనివారం అందజేసినట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు.

సబ్సిడీపై జీలుగా విత్తనాలు పంపిణీకి సిద్ధం



జీలుగ విత్తనాల బస్తాలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా ప్రాథమిక సహకార సంఘం నందు సబ్సిడీపై జీలగా విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. శనివారం పంపిణీకి సిద్ధంగా ఉన్న జీలగా విత్తనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు 666 బస్తాలు, నల్లమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీ నందు 166 బస్తాలు జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండడంతో మండలంలోని సన్నా చిన్నకారు రైతులు జీలగా విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన రైతులు, పట్టాదార్ పాస్ పుస్తకం జీరాక్స్, ఆధార్‌కార్డు జీరాక్స్ తీసుకుని వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద పర్మిట్ రాయించు కోవాలని అన్నారు. జీలుగా 30 కిలోలు బస్తా 2 ఎకరాల 20 గుంటలకు వస్తదని తెలిపారు. 60 శాతం సబ్సిడీ కింద 30 కిలోల బస్తాకు రైతు చెల్లించాల్సిన ధర రూ.1116 చెల్లించాలన్నారు. ఆయన వెంట విస్తీర్ణ అధికారులు సంతోష, ప్రశాంత్, మధుసూదన్, సిబ్బంది తదితరులున్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆయిల్, కాపర్‌వైర్ చోరీ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని లింగంపల్లి కలాన్ శివారులోని ఎస్ఎస్ నెంబర్ 22 ,25 కే వి సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుండి 100 లీటర్ల ఆయిల్ తో పాటు కాపర్ వైర్ చోరికి గురైనట్టు ఏఈ మనోరంజన్ తెలిపారు. సుమారు రెండు లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

నవతెలంగాణ-సదాశివనగర్



అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదనతో ఓ వ్యక్తి వాటర్‌ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఒడ్డె రాజు అనే వ్యక్తి వాటర్ ట్యాంక్ ఎక్కడంతో స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సదరు వ్యక్తితో మాట్లాడి సముదాయించి ట్యాంక్ నుంచి కిందకు దించారు. ఈ సందర్భంగా పోలీసుల కృషిని స్థానికులు ప్రశంసించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన రెడ్డి ఐక్య వేదిక నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని రెడ్డి ఐక్య వేదిక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేద రెడ్డి సామాజిక వర్గం కోసం రెడ్డి కార్పొరేషన్ ప్రకటించడం సంతోషంగా ఉందని, కార్పొరేషన్ విధివిధానాలు, పాలకవర్గం, అధికారికంగా జీవో విడుదల చేయాలని శనివారం జరిగే క్యాబినెట్ సమావేశంలో చర్చించాలని ప్రభుత్వ సలహాదారులు, పెద్దలు వేం నరేందర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.


వేంనరేందర్‌రెడ్డికి సన్మానం

అయ్యప్పస్వామి ఆలయంలో వార్షికోత్సవ వేడుక.

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో 11వ వార్షికోత్సవ వేడుకలు సేవాసమితి సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాకేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచ ద్రవ్యాలతో అభిషేక పూజ, మహా హెూమం నిర్వహించారు. ఏర్గట్ల గ్రామానికి చెందిన జుంగల గంగారాం రూ.5016 విరాళంగా ఇవ్వడంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి సేవాసమితి సభ్యులు మగ్గిడి వెంకటేష్ గౌడ్, భక్తులు పాల్గొన్నారు.


వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న పలువురు

జీలుగతో అధిక దిగుబడి

- మండల వ్యవసాయాధికారి జాదవ్ హీరా


జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

జీలుగా విత్తనాలను చల్లి.. పచ్చిరొట్టిగా మార్చుకొని పొలాన్ని సారవంతం చేసుకొని అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి జాదవ్ హీరా అన్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని మాధవ్‌నగర్, పాల్దా, ముత్తకుంట, గుండారం వ్యవసాయ సహకార సంఘాలలో సబ్సిడీపై జీలుగా విత్తనాలు పంపిణీ చేశారు. జీలుగా వంటివి సాగుచేసి పచ్చిరొట్టిగా మార్చుకొని పొలాన్ని సారవంతం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించార. సొసైటీ కార్యాలయాల్లో జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టా పాసు పుస్తకం జిరాక్స్ తీసుకువచ్చి ఏఇఓ వద్ద నమోదు చేసుకొని తీసుకు వెళ్లాలని సూచించారు.

'లీకేజీ'కి మరమ్మతులు

- నవతెలంగాణ వార్తకు స్పందన


గుంతను పూడ్చివేయించిన అధికారులు

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోరా గ్రామంలో నీటి పైపులైన్ లీకేజీతో గుంత ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారడంతో 'వాటర్ లీకేజీ.. రోడ్డుపై ఏర్పడిన గుంత' అనే శీర్షికన నవతెలంగాణ దినపత్రికలో శనివారం వార్త ప్రచురితమైంది. దీంతో మండల ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ సాత్విక, ఎంపీవో చందర్ వెంటనే స్పందించి శనివారం రోడ్డుపై ఉన్న పైప్‌లైన్ లికేజీని నివారించేందుకు గానూ మరమ్మతులు చేపట్టారు. అలాగే రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చివేశారు. స్థానికంగా అధికారులే దగ్గరుండి జెసిబి ద్వారా గుంతను తవ్వించి నీరు లీకేజీ కాకుండా మరమ్మతులు చేసి నూతన పైప్‌లైన్‌ను బిగించారు. దీంతో గ్రామ ప్రజలు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జాకోర గ్రామపంచాయతీ సెక్రెటరీ, కారోబార్ అయూబ్, పంచాయతీ కార్మికులు, తదితరులున్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

- టీబీ ఎండి అవార్ హైమద్


మాట్లాడుతున్న టీబీ ఎండి అవార్ హైమద్

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామీణ ప్రాంతాలలో టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించి వ్యాధి నివారణకు తగు చర్యలు తీసుకోవాలని టీబీ ఎండీ అవార్ హైమద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన స్థానిక వైద్య సిబ్బంది, ఆశావర్కర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. టీబీ వ్యాధి అతి భయంకరమైందని, కాబట్టి ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరుగుతూ వ్యక్తులను గుర్తించి వారి నివేదికలను జిల్లా స్థాయి సంబంధిత అధికారులకు అందజేయాలని సూచించారు. టీబీ వ్యాధి లేని గ్రామాలు ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ఇప్పటివరకు 15 మందికి టీబీ వ్యాధి ఉన్నట్లు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు గుర్తించారని ఆయన తలిపారు. 15 మంది వ్యక్తులకు చికిత్స నిర్వహించడం వల్ల వ్యాధి కొంచెం నయమైనట్లు ఆయన వివరించారు. నిర్లక్ష్యం వహించకుండా వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఎమ్మెల్ హెచ్‌పీలు కలిసి ఐక్యతగా ఉండి సర్వే నిర్వహించాలని ఆయన ఆదేశించారు. తప్పుడు సర్వేలు ఇస్తే జిల్లా వైద్యశాఖ అధికారికి అలాగే జిల్లా కలెక్టర్‌కు నివేదికలను అందజేస్తానని ఆయన అన్నారు. టీబీ వ్యాధి నివారణకు కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో పద్మ (ఎస్‌టిఎస్‌ఎస్) సూపర్వైజర్లు దేవేందర్, జీవమ్మా ల్యాబ్ టెక్నీషియన్స్ కృష్ణమోహన్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

23న లక్ష్మీనరసింహ సహిత రాజరాజేశ్వర స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని ఇస్సాపల్లి గ్రామ లక్ష్మి నరసింహ సహిత రాజరాజేశ్వర స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఈనెల 23న గురువారం నిర్వహిస్తున్నట్టు విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి పూజ, యజ్ఞం, అభిషేకాలు, స్వామివారి కళ్యాణం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లక్షలు వెచ్చించారు..
లక్షణంగా వదిలేశారు

- ప్రారంభోత్సవానికి నోచుకోని పల్లె దవాఖానా
- వైద్య సేవలకు తప్పని ఇబ్బందులు

నవతెలంగాణ-బోధన్

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి బోధన్ మండలంలోని పలు గ్రామాలలో పల్లె దవాఖానా భవనాలను నిర్మించింది. అంత వరకు బాగానే ఉంది. కానీ.. బోధన్ మండలం కొప్పర్గ గ్రామంలో నిర్మించిన పల్లె దవాఖాన భవనం నిర్మాణం పూర్తయి సుమారు 6, 7 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ప్రారంభోత్సవం చేయలేదు. దాంతో గ్రామ ప్రజలకు వైద్య సేవలందక ఇబ్బందులు పడవవసి వస్తుంది.



ప్రారంభించని పల్లె దావఖానా

అంతేకాకుండా వైద్యం కోసం సాలూర పీహెచ్‌సీకి, పెగడాపల్లి పీహెచ్‌సికి బోధన్ జిల్లా ఆసుపత్రికి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. పల్లె దవాఖాన పనులు సంపూర్ణంగా పూర్తయిన విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. భవనం నిరుపయోగంగా ఉండడంతో ఆకతాయిలు వెంటిలేషన్ అద్దాలను ధ్వంసం చేశారు. ప్రస్తుతం వైద్య సిబ్బంది ఇరుకైన గదిలో వైద్య సేవలు అందించడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పల్లె దవాఖాన ప్రారంభిస్తే గర్భిణీలకు, బాలింతలకు వ్యాక్సినేషన్, ఇమ్యూనైజేషన్‌తో పాటు ఇతర వైద్య పరీక్షలు చేపట్టే అవకాశం ఉంది. కావున అధికారులు ఇప్పటికైనా స్పందించి పల్లెదవాఖాన ప్రారంభించి రోగులకు, గర్భిణి, బాలింతలకు వైద్య సేవలందించే ఏర్పాట్లు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రైతులు లోతుగా దుక్కులు దున్నాలి

- వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్

నవతెలంగాణ-ఏర్గట్ల



రైతులు వేసవి కాలంలో లోతు దుక్కులను చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ శనివారం తెలియజేశారు. ఎంత లోతుగా దుక్కి దున్నుకోవాలనేది మనం వేయబోయే పంటనుబట్టి కూడా ఉంటుందని చెప్పారు. కంది లోతుగా దున్నుకోవాలని, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ, మొదలగు పంటల వేర్లు మధ్యరకంగా 15 నుంచి 20సెం.మీ. లోతు సరిపోతుందని తెలిపారు. లోతుగా దున్నినప్పుడు గట్టిపొర విచ్ఛిన్నమై నేల గుల్లగా తయారవడమే కాకుండా, నేలలో గాలి శాతం, నీటిని పీల్చుకునే లక్షణాలు పెరుగుతాయని, తద్వారా సూక్ష్మజీవుల సంతతి, చర్యలు పెరుగుతాయని పేర్కొన్నారు. దీని వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు త్వరగా విచ్ఛిన్నమై, పోషకాలుగా విడుదల అవుతాయని, కలుపు మొక్కల వేర్లు, పురుగు మందుల అవశేషాలు నేలలో ఉండడం వలన, లోతు దుక్కులు చేయడం ద్వారా విష పదార్థాలు విచ్ఛిన్నమై పంటల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. వేసవిలో భూమిని దున్నే ముందు నేలలో పశువుల ఎరువుగాని, కంపోస్టుగాని, చెరువులోని నల్లమట్టిని గాని, వెదజల్లడం వలన నేల సారవంతమౌతుందని రైతులకు సూచించారు. వేసవిలో లోతు దుక్కులు చేయడం ద్వారా కలుపు మొక్కలు వాటి విత్తనాలు నశింపబడతాయని, మొండి జాతికి చెందిన తుంగ వంటి కలుపు మొక్కలు అన్ని రకాల నేలల్లో సమస్యాత్మకంగా మారుతున్నాయని, ఇలాంటి కలుపు మొక్కల దుంపలు లోతు దుక్కులు చేయడం వలన సూర్యరశ్మికి బహిర్గతమై చనిపోతాయన్నారు. ఇవి ఏ కారణం చేతనైనా నేల లోపలి పొరలు గట్టిపడి, మురుగునీరు పోవు మార్గం లేనప్పుడు, గాలి, నీటి శాతం మొక్కకు తగు మోతాదులో తగ్గుతుందని, దీని ద్వారా పంటల మొక్కల వేర్లు పెరుగుదల, పోషకాల లభ్యత తగ్గి, శ్వాసక్రియ లాంటి చర్యలు తగ్గుతాయని తెలిపారు. వీటి ద్వారా పంట మొక్కలు చనిపోతాయని వివరించారు. ఈ సమస్యను నివారించడానికి వేసవి దుక్కులు చేయడం ద్వారా భూమిలోని గట్టి పొరలు విచ్ఛిన్నమై నేల గుల్లబారుతుందని, నేలలో గాలిశాతం, నీటిని పీల్చుకొనే లక్షణాలు పెరుగుతాయని, వీటి ద్వారా సూక్ష్మజీవుల సంతతి చర్యలు కూడా పెరుగుతాయని తెలిపారు. కావున, వేసవి దుక్కులు దున్నుకొని, నేల సారవంతత కాపాడుతూ.. రైతులు అధిక దిగుబడులు పొందవచ్చునని సూచించారు.

ప్రతిరోజూ వ్యాయామంతో ఆరోగ్యం

- ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి
- మనోరమ ఆస్పత్రి ఆధ్వర్యంలో హైబీపీపై అవగాహన ర్యాలీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య జాగ్రత్తలు చాలా అవసరమని, క్రమం తప్పకుండా ప్రతిరోజు వ్యాయామం చేయడానికి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని అప్పుడే ఆరోగ్యవంతులుగా జీవించగలుగుతామని వైద్యులు రాజేంద్ర శ్రీకాంత్ అన్నారు. శనివారం మనోరమ ఆసుపత్రి ఇన్చార్జ్ వైద్యులు డాక్టర్ కట్ట నరసింహ ఆధ్వర్యంలో బీపీకి సంబంధించిన అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కట్ట నరసింహ, డాక్టర్ రాజేంద్ర శ్రీకాంత్, డాక్టర్ హితేష్ కుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్య జాగ్రత్తల పట్ల నిర్లక్ష్యం చేస్తూ అనారోగ్యానికి గురవుతున్నారని, బీపీలు వంటి జబ్బులకు గురికాకుండా ఉండాలంటే కచ్చితంగా ఫాస్ట్‌ఫుడ్, అధిక ఉప్పు, కొలెస్ట్రాల్‌కు సంబంధించిన పదార్థాలను నివారించాలని వారు సూచించారు. ప్రస్తుతం భారతదేశంలో బీపీ వంటి వ్యాధిగ్రస్తులు అధికమై అనేక రోగాలకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారన్నారు. బిపి లాంటి వ్యాధి ఒకసారి సోకితే జీవితాంతం ఉంటుందని కేవలం సాధారణ స్థితిలో ఉండేందుకే తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుందని వారు అన్నారు. ముఖ్యంగా ప్రతిరోజు ఎక్సర్‌సైజ్, వాకింగ్, స్విమ్మింగ్ చేస్తే ఖచ్చితంగా ఆరోగ్యవంతులుగా ఉండగలుగుతామని వారు అన్నారు. అంతకుముందు ప్రపంచ బిపి నివారణ దినోత్సవం పురస్కరించుకొని శనివారం ఉదయం మనోరమ ఆసుపత్రి నుంచి ప్రత్యేకంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీలో శ్రావణ్, నరసయ్య, రాజేష్, సురేష్, రమేష్, రవి, నరేష్, స్వప్న, స్రవంతి, రవికిషోర్, ప్రిమాల, కావ్య రాధా, మాధవతో పాటు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఆస్పత్రి సిబ్బంది

నిరుపేద ఆర్యవైశ్యులను ట్రస్ట్‌తో ఆదుకుంటాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి జన్మదినం పురస్కరించుకొని ఆర్యవైశ్య పట్టణ సంఘంలో వాసవి కన్యాకాపరమేశ్వరి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నామకరణ డోలారోహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మొదట అమ్మవారి ప్రతేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి నామకరణ, డోలారోహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం కన్యాకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినాన్ని ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. నిరుపేద ఆర్యవైశ్యులకు తన ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవలు అందిస్తానని అన్నారు. అనంతరం ఆర్యవైశ్యులలో నిరుపేద వృద్ధులకు, వికలాంగులకు నెలవారీ పెన్షన్ కింద దాదాపు 55 మందికి తన ట్రస్ట్ ద్వారా నెలకు రూ.200 ఇస్తానని హామీనిచ్చారు. మొదటి నెలగా లబ్దిదారులకు పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ కుటుంబాన్ని వాసవి దేవాలయ కమిటీ వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో దొంతుల కాశీ విశ్వనాథం గుప్తా, కొండ నరేంధర్ గుప్త, పెండ్యాల శ్రీనివాస్ గుప్త, పాల్తి రవి కుమార్ గుప్త, గాలి శ్రీనివాస్ గుప్త, కొండ వీరశేఖర్ గుప్త, ఆగమయ్య, ఎంసాని రవి, గజవాడ శ్రీనివాస్, ఇల్లెందుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి సేవలో అర్బన్ ఎమ్మెల్యే కుటుంబం

జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు అడ్మిషన్స్ డ్రైవ్

నవతెలంగాణ-మెండోరా



బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం మండలంలోని వెల్కటూర్, వెంచిర్యాల్, రెంజర్ల గ్రామాల్లో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో పిజి అధ్యాపకులచే విద్యను అందిస్తూ కార్పొరేట్ కాలేజీలకంటే కూడా ఉన్నత విద్యను బోధిస్తామని విద్యార్థులకు తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మురళి, కైలాస్ తదితరులు పాల్గొన్నారు

ఎంసెట్ అగ్రికల్చర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు

నవతెలంగాణ-ఆర్మూర్



ఆలూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్ కుమారుడు మేసా అర్జున్ ఎంసెట్ అగ్రికల్చర్‌లో 579వ ర్యాంక్ సాధించినందుకు శనివారం పలువురు అభినందించారు. వీరి తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. అమ్మ రేణుక లక్కోర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తమ కుమారుడు 579 ర్యాంక్ సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం సంతోషం వ్యక్తం చేశారు.

రెంజల్ ఇంచార్జి తహసీల్దార్‌గా శ్రావణ్ కుమార్

నవతెలంగాణ-రెంజల్

మండల ఇంచార్జి తహసీల్దార్‌గా శ్రావణ్ కుమార్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. రెంజల్ తహసీల్దార్‌గా పనిచేసిన ఎంఏ ఖలీమ్ దీర్ఘకాలిక లీవ్‌పై వెళ్లగా ఆయన స్థానంలో బోధన్ నుంచి ఇన్చార్జి తహసీల్దారుగా శ్రావణ్ కుమార్ బాధ్యతలను స్వీకరించారు.


ఇంచార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రావణ్ కుమార్

పౌష్టికాహారం అందజేత


బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామ అంగన్వాడీ సెంటర్ వద్ద శనివారం ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా పిప్రి సెక్టార్ సూపర్వైజర్ వెంకట రమణమ్మ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశానుసారం మూడు సంవత్సరాలలోపు పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాట్లు పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రి గ్రామ జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలను మండల అభివృద్ధి అధికారి సాయిరాం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, మరుగుదొడ్ల పునర్నిర్మాణ తదితర పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న అధికారులు

వాసవీమాత జయంతి వేడుకలు


వాసవీమాత జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు

నవతెలంగాణ-సిరికొండ

వాసవీమాత జయంతి సందర్భంగా తాళ్లరామడుగు రామాలయ గుడి ఆవరణలో ఆర్యవైశ్య మండల అధ్యక్షులు మురళి, రామాలయ శాశ్వత చైర్మన్ బచ్చు పురుషోత్తం, ఆర్యవైశ్య మండల సెక్రెటరీ, ఆర్యవైశ్య మండల కమిటీ ఆధ్వర్యంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కొనసాగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శనివారం సెమీఫైనల్‌లో కోరుట్ల, ఆర్మూర్ జట్లు తలపడ్డాయి. అందులో కోరుట్ల సెమీఫైనల్‌లో విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అర్షద్‌కు ముఖ్య అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ మండలాధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, మైనారిటీ మండలాధ్యక్షుడు జావిద్, కుందరం శ్రీనివాస్, కట్టెల శ్రీనుగౌడ్, ప్రవీణ్‌గౌడ్, కిషన్ గౌడ్, సంతోష్ గౌడ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేత

ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి తపస్వి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఎక్స్‌సిడబ్ల్యూసి చైర్‌పర్సన్ అడ్వకేట్ శ్యామలా దేవి ఫౌండర్ ఆఫ్ లైట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు వారి బృందం విచ్చేసి విలువతో కూడిన విద్యపై అవగాహన రావడానికి బాలల హక్కులు చట్టాలు యంత్రాంగంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. బీహాండ్ ద క్లాస్ రూమ్ అని దీనికి నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో తపస్వి చైర్‌పర్సన్, ఫౌండర్ పద్మావతి, అధ్యక్షులు సుశీల, సెక్రెటరీ దిలీప్‌రెడ్డి, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ చైర్మన్ గంగాధర్,కౌన్సిలర్ లిక్కీ శంకర్, డైరెక్టర్ శ్రీనివాస్, పీఈటి ప్రదీప్, తపస్వి స్వచ్ఛంధ సేవా సంస్థ బృందం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలువురు

నట్టేట ముంచుతున్న నకిలీలు

- మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు
- నష్టపోయిన రైతులు
- ఎరువులు, విత్తనాలు, మందులు కొనుగోలు చేసేటప్పుడు రైతన్నలు జర జాగ్రత్త

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనూ నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి బ్రాండెడ్ విత్తన కంపెనీల ముసుగులో నకిలీ విత్తనాలు అమ్ముకునేందుకు విత్తన మాఫియా సిద్ధమైంది. ఏటా మాదిరిగానే ఈసారి కూడా పనికిమాలిన విత్తనాలను కట్టబెట్టి రైతులను నిండా ముంచే ముఠాల ఆగడాలు జిల్లా వ్యాప్తంగా అడ్డు అదుపులేకుండా కొనసాగుతున్నాయి. పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు నిర్వహిస్తున్నా నకిలీ విత్తనాల అమ్మకం యథేచ్ఛగా కొనసాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రకరకాల డిస్ట్రిబ్యూషన్ కంపెనీల పేరుమీద బ్రాండెడ్ కంపెనీల లోగోలతో దర్జాగా నకిలీ విత్తనాల అమ్మకాలు కొనసాగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.

బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్ మండలంలో 15 ఎరువుల దుకాణాలు ఉండగా రెండు ప్రయివేటు విత్తనాల దుకాణాలు ఉన్నాయి. నసురుల్లాబాద్ మండలంలో 13 ఎరువులు దుకాణాలు ఉండగా దుర్కి గ్రామంలో 3 ప్రయివేటు విత్తనాల దుకాణాలున్నాయి. బాన్సువాడ మండలంలో 28 ఎరువుల షాపులు, 24 విత్తనాల షాపులున్నాయి.

బాన్సువాడ డివిజన్‌లో నకిలీల జోరు..

బాన్సువాడ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో నకిలీ విత్తనాల జోరు సాగుతుంది. నకిలీ విత్తనాలను అరికట్టాల్సిన అధికారులు తూతూ మంత్రంగా తనిఖీ నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. యాసంగిలో బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్ మండల కేంద్రంలో గ్రోమోర్ దుకాణం వారు నకిలీ విత్తనాలను సరఫరా చేయడంతో 500ల ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లడంతో రైతులు బోరున విలపిస్తూ గ్రోమోర్ దుకాణం ముందు నిరసన చేపట్టారు. ప్రత్యేక బాన్సువాడ డివిజన్‌లో ఏదో ఒక మండలంలో నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టవలసిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విత్తనాల ఎరువుల షాపుల యజమానుల నుంచి ముడుపులకు అలవాటు పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

బీర్కూర్ గ్రోమోర్ దుకాణం నకిలీ విత్తనాలు సరఫరా చేయడంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేసినప్పటికీ ఇప్పటికీ ఎలాంటి సహాయం అందలేదు. ఇటీవల బాన్సువాడ డివిజన్ పరిధిలో నకిలీ విత్తన సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వీరికి రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇష్టారాజ్యంగా నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నారు.

సీఎం ఆదేశాలు బేఖాతరు..

రాష్ట్ర ప్రభుత్వం నకిలీ విత్తనాల తయారీపై ఉక్కుపాదం మోపుతున్నా, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలను అధికారులు బేఖాతరు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తన మాఫియా నిందితులపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తున్నా ఫలితం అంతంత మాత్రంగానే ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం వానాకాలం సీజన్ సమీపించిన నేపథ్యంలో కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలో నకిలీ విత్తనాల హవా కొనసాగుతూనే ఉంది. సరిహద్దు రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా కాలం చెల్లిన, నాసిరకం విత్తనాలు బాన్సువాడ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాల రైతులకు అందుబాటులోకి వచ్చేశాయి. తక్కువధర, అధిక దిగుబడి, త్వరగా పంట చేతికొస్తుందని రైతులను నమ్మిస్తున్న వ్యాపారులు అన్నదాతలను నిండా ముంచుతున్నారు.



అందోళన చేస్తున్న రైతులు (ఫైల్)



ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు..

కొంతమంది ఏజెంట్లను పెట్టుకుని మరి నేరుగా గ్రామాల్లోకే వచ్చి రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారంటే విత్తన మాఫియా ఆగడాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రముఖ కంపెనీల బొమ్మ చూపించి భారీ దిగుబడిని ఎరగా వేసి రైతులకు విక్రయిస్తున్నారు. అమ్మిన విత్తనాల తాలూకు రశీదును కూడా ఇవ్వడం లేదు. విత్తన భాండాగారంగా అవతరించిన బాన్సువాడ డివిజన్‌కు ఎక్కువ మొత్తంలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచే నాసిరకం విత్తనాలు సరఫరా అవుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నకిలీ విత్తనాల కట్టడికి రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా ఫలితం ఉండడం లేదు.

ఏప్‌సెట్‌లో ర్యాంకు సాధించిన పెర్కిట్ విద్యార్థి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన దువ్వూరి జ్యోతి సమన్విత్ ఎంసెట్లో 114 ర్యాంకు సాధించాడు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో ర్యాంకు సాధించినట్లు విద్యార్థి తల్లిదండ్రులు దువ్వూరి లక్ష్మి రాజ్యం, మహేందర్ తెలిపారు. ఈ విద్యార్థి ప్రాథమిక విద్యాభ్యాసం పెర్కిట్‌లోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో జరిగింది. సెకండరీ పాఠశాల విద్యాభ్యాసం కృష్ణాజిల్లా గుడివాడ విశ్వభారతిలో చేశాడు. సమన్విత్‌కు పదవ తరగతిలో 583 మార్కులు రాగా, హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో చదివిన ఇంటర్‌లో 985 మార్కులు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో 112వ ర్యాంకు సాధించగా, ఇప్పుడు జరిగిన ఎంసెట్ పరీక్షల్లో రాష్ట్రవ్యాప్తంగా 114వ ర్యాంకు సాధించినట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు. విద్యార్థి తండ్రి మహేందర్ ప్రస్తుతం తొర్లికొండలో ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎంసెట్‌లో 114వ ర్యాంకు సాధించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



దువ్వూరి జ్యోతి

నూతన చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజయంతి ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి.లక్ష్మీనర్సయ్య నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో ని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భారతీయ న్యాయ సన్నిహిత-2023, భారతీయ సాక్ష అధినయం-2023, భారతీయ నాగరిక సురక్ష సన్నిహిత-2023 చట్టాల గురించి డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య క్లుప్తంగా వివరించారు. ప్రతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన విధులను శ్రద్ధతో నిర్వహించి, నూతన చట్టాలను అవలంభించి నేరస్తులకు శిక్షపడేటట్లు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవిరాజ్, రాజగోపాల్ గౌడ్, రాజారెడ్డి, బంటు వసంత్, కావేటి శేషు, నంద రమేష్, ఖాందేష్ శ్రీనివాస్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు భూసారపు రాజేష్‌గౌడ్, డా.సమ్మయ్య, మహ్మద్ రహిముద్దీన్, అశోక్ శివరాంనాయక్, చిదిరాల రాణి, పొరిక రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఏప్‌సెట్‌లో కాకతీయకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మహానగరాలకు ధీటుగా కాకతీయ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిందని కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ సిహెచ్ విజయలక్ష్మి అన్నారు. శనివారం విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర ఏప్ సెట్ -2024 ఫలితాలలో కాకతీయ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలతో పాటు మొదటిసారిగా, లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకోకుండా, ఒకే అటెంప్ట్‌లోనే ఉత్తమ ర్యాంకులు సాధించారని అన్నారు. ఏం మెహర్ 1424, మిన్హాజ్ 2224, మణికాంత్ 2580, ఏ మాలిక్ 3290, రిశిక్షాయి 4161, అంజుం 4247, శ్రీహిత 5084, తయ్యబ్ 5400, భార్గవ సాయి 5629, ఏ.హది 6500, పి లక్షిత్ 8616, ఏ.మోద్ 9222 రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ డైరెక్టర్ సి. హెచ్. తేజశ్విని మాట్లాడుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి కాకతీయ ఐఐటి నీట్ ఎంసెట్ అకాడమిలోని ప్రత్యేక పాఠ్య ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధన, యాజమాన్య నిరంతర పర్యవేక్షణ, వారాంతపు పరీక్షలే ముఖ్య కారణమని వివరించారు. అంతేకాకుండా ఈ స్టేట్ ర్యాంకులు ఇంటర్‌తో పాటు డైరెక్టుగా తొలి ప్రయత్నంలోనే సాధించినవని, లాంగ్ టర్మ్ కోచింగ్ అందించినవి కావని అన్నారు. ఈ సందర్భంగా ఐఐటి నీట్ ఎంసెట్ అకాడమీ డైరెక్టర్ సిహెచ్ రామోజీరావ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం జేఈఈ మెయిన్స్ ఫలితాలలో, తెలంగాణ ఎంసెట్ ఫలితాలలో, ఇంటర్ ఫలితాలలో, జాతీయ స్థాయి నీట్ ఫలితాలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి తమ విద్యార్థులు నిజామాబాద్ జిల్లా స్థాయిలోనే కాకుండా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైతం సత్తా చాటారని తెలిపారు. ఇంతటి మంచి ఫలితాలను సాధించిన అధ్యాపక బృందానికి, ప్రిన్సిపాల్‌కు, డైరెక్టర్ చేతుల మీదుగా శుభాభినందనలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛల అందించి శుభాకాంక్షలు తెలిపారు.



మహిర, మినహజ్, రిషిక్‌సాయి, మనికంత

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భాశయం తొలగింపు

- ప్రయివేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ గర్భాశయాన్ని తొలగించారని, ఈ ఘటనకు పాల్పడిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాన్సువాడ మండలానికి చెందిన రహేలా ఫిర్దోస్ (24) అనే వివాహితకు ఏప్రిల్ 25న రాత్రి 11.30 గంటలకు విపరీతమైన కడుపునొప్పి రావడంతో పాటు రక్తస్రావం కావడంతో షాహీన్‌ను డాక్టర్ సనుబర్ రెహమాన్ (ఎంఎస్ ఓబిజి), షాహీన్ హాస్పిటల్‌కు తరలించారని డాక్టర్ సనుబర్ రెహమాన్ ఆమె రక్తస్రావాన్ని నియంత్రించడానికి, చికిత్స నిర్వహించడానికి సరైన పరికరాలు లేవని (సెకండరీ పిపిహెచ్), తీవ్రమైన స్థితిలో నిజామాబాద్‌లోని మనోరమ ఆసుపత్రికి రిఫర్ చేశారని తెలిపారు. అక్కడ సంబంధిత డాక్టర్ రమాదేవి ఆమెను ఎమర్జెన్సీ బేస్‌పై ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్లారని, ఎక్స్‌ప్లోరేటివ్ లాపరోటమీ, ఆమె తీవ్రమైన అనియంత్రిత రక్తస్రావం దృష్ట్యా ప్రసూతి హిస్టెరెక్టమీ (గర్భాశయాన్ని శాశ్వతంగా తొలగించడం) చేసిందన్నారు. షాహీన్ హాస్పిటల్‌లో ప్రాథమిక వైద్య పరికరాలు లేకపోవడంతో ఈ పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చిందని, షాహీన్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహిళ గర్భాశయం తొలగించారని ఈ మేరకు ఆ ఆసుపత్రి వైద్యురాలు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



టెట్ అభ్యర్థులకు బస్సు ఛార్జీల మినహాయింపు కల్పించాలి

నవతెలంగాణ-ఏర్గట్ల

ఈ నెల 20 నుండి ఆన్‌లైన్ విధానంలో టెట్ పరీక్ష రాయబోయే అభ్యర్థులకు బస్సు ఛార్జీల్లో మినహాయింపు కల్పించాలని ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి మండల కేంద్రంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రూ.400గా ఉన్న పరీక్ష ఫీజును ఏకంగా రూ.1000కి పెంచి అభ్యర్థులపైన ఆర్థిక భారాన్ని మోపారని ఆయన మండిపడ్డారు. ఇదిలా ఉండగా అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల కేటాయింపుల విషయంలో, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపించారు. దరఖాస్తు సమయంలో అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్లకు సంబంధం లేకుండా కేంద్రాలను కేటాయించడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. దూర ప్రాంతాల్లో కేంద్రాలను కేటాయించడంతో అభ్యర్థులు ఒక రోజు ముందే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని, దీని వలన ప్రయాణపు ఖర్చులు, వసతి వంటి అదనపు భారం పడుతుందని, దీన్ని దష్టిలో ఉంచుకొని ప్రభుత్వం, అధికారులు స్పందించి హాల్ టిక్కెట్ ఉన్న అభ్యర్థులకు కనీసం బస్సు ఛార్జీల్లోనైనా మినహాయింపునివ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వీరబ్రహ్మంగారి గోవిందమ్మ కళ్యాణం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామంలో శనివారం శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మంగారి గోవిందమ్మ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

నామమాత్రంగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-మోపాల్

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లతా కన్నిరామ్ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశం నామమాత్రంగానే జరిగింది. ఒకరిద్దరు ఎంపీటీసీలు మాత్రమే తమ గ్రామ సమస్యలను అక్కడున్న అధికారుల ముందుకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామారావు మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే మండల కేంద్రంలో గల రెండు ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతిలో ఇద్దరు విద్యార్థులు 10/10 సాధించారని తెలిపారు. అనంతరం ఏవో రవీందర్ మాట్లాడుతూ.. రైతులు తమ పొలాలలో పంట కోసిన వెంటనే వాటిని తగలబెట్టకుండా అందులోనే ఆ గ్రసాన్ని ఎరువుగా మార్చుకోవాలని దాని వల్ల భూమికి సరైన పోషకాలు అందుతాయని తెలిపారు. అలాగే వాతావరణ కాలుష్యాన్ని కూడా నివారించవచ్చని ఆయన వివరించారు. అలాగే జీలుగా విత్తనాలు కూడా సొసైటీలోకి అందుబాటులోకి వచ్చాయని ఒక హెక్టార్‌కి ఒక బ్యాగు చొప్పున సొసైటీలో పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. రైతు భరోసా డబ్బులు కూడా జమవుతున్నాయని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో చెక్‌డ్యాం కోతకు గురవుతుందని దానికి మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ ఎఈ దృష్టికి తీసుకెళ్లారు. అతి త్వరలో చెక్‌డ్యాం నివేదికను తయారుచేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాలని ఆయన సమాధానమిచ్చారు. అలాగే ఎంపీపీ లతా మాట్లాడుతూ.. తమ పదవి కాలంలో సహకరించిన అధికారులు, ఎంపీటీసీలకు ధన్యవాదాలు తెలిపారు. అతి త్వరలో తన పదవి కాలం ముగుస్తుందని ఆమె తెలిపారు. అలాగే తన పదవి కాలంలో తాను చేసిన అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింగం నాయక్, తహసీల్దార్ రామేశ్వర్, పంచాయతీరాజ్ ఏఈ స్రవంతి, మిషన్ భగీరథ ఏఈ వినయ్‌రెడ్డి, ఐసిడిఎస్ అధికారులు, ఉపాధి హామీ ఫీల్డ్ అధికారులు, ఎన్జీవోస్, ఎంపీటీసీలు రాములు, రమేష్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో 2024-25వ సంవత్సరానికి గానూ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఎలక్ట్రీషన్, కోపా, వెల్డర్, ఫిట్టర్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, కనుక అర్హులైన విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ITI.TELANGANA.GOV.IN వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

నత్తనడకన కొనుగోళ్లు

- అకాల వర్షాలతో ఇబ్బందులు
- రైతుల్లో ఆందోళన

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన కొనసాగుతున్నాయి. రబీ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. కేంద్రాలను ప్రారంభించి నెలరోజులు గడుస్తున్నా.. ధాన్యం కొనుగోలు చురుకుగా సాగడం లేదు. రైతుల వద్ద నుంచి ధాన్యం సక్రమ పద్ధతిలో కొనుగోలు జరుగుతుందా లేదా అన్నది చూడాల్సిన సివిల్ సప్లయ్ అధికారుల జాడలేదు. కొనుగోలు కేంద్రాల పరిధిలో పండిన ధాన్యం ఏ మేరకు ఉందో అధికారులు అంచనా వేయడంలో విఫలమయ్యారు.

పెద్ద ఎత్తున ధాన్యం కేంద్రాలకు రావడంతో రైతులకు వరుస క్రమంలో నెంబర్లు ఇచ్చి కొన్నిచోట్ల చేతులు దులుపుకున్నారు. నెంబర్లు తీసుకున్న రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి అనేక రోజులు గడుస్తున్న తూకం వేసి రైస్ మిల్లులలో తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. కొన్ని కేంద్రాలలో లారీలు రాకపోవడంతో ధాన్యం కేంద్రాలలోనే ఉంది. మరికొన్నిచోట్ల హమాలీల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది.

అకాల వర్షాలతో ఇబ్బందులు..

వరికి కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని తూకం వేసి తరలించడంలో జాప్యం జరుగుతుంటే మరోవైపు అకాల వర్షాలు రైతులకు కన్నీరు పెట్టిస్తున్నాయి. నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన వరి ధాన్యం కేంద్రాలలో అకాల వర్షాలకు తడిసిపోతున్నాయి. ధాన్యం తడిసిపోవడంతో సొసైటీలోని సిబ్బంది తూకం వేయడం లేదు. ఎండిన ధాన్యం అకాల వర్షాలకు తడిసిపోవడంతో తిరిగి ఎండబెట్టడం రైతులకు కష్టతరంగా మారింది. కొన్ని కొనుగోలు కేంద్రాలలో తూకం వేసి సంచులలో నింపి తరలించడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం సైతం తడిసిపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. జిల్లా కలెక్టర్, సివిల్ సప్లయి అధికారులు చొరవ చూపి కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని లారీలలో తరలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లోనున్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటనలకే పరిమితం కాకుండా చేతలలో చేసి చూపించాలని రైతులు కోరుతున్నారు.



పట్టణంలోని మామిడిపల్లి వద్ద ధాన్యం కుప్ప

కాంగ్రెస్ మాటల గారడి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కాంగ్రెస్ గత ఎన్నికల్లో పంటకు రూ.500 బోనస్ ఇస్తానని హామీనిచ్చి ఇప్పుడు సన్నవడ్లకే అనడం కాంగ్రెస్ మాటల గారడీకి నిదర్శనమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా ఆరోపించారు. శనివారం బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్ష పార్టీ అని చెప్పుకుంటూ రైతులను మోసం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ అంటేనే రైతు బక్ష పార్టీ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే రాహుల్, రేవంత్ (ఆర్ఆర్) టాక్స్ నడుస్తుంటే ఇప్పుడు కొత్తగా ఉత్తమ్ (యు) టాక్స్ కూడా పెట్టారని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 43 రూపాయలకు బియ్యం అందించాలని చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం 57 రూపాయలకు టెండర్లకు ఆహ్వానిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైస్ మిల్లర్లతో చీకటి ఒప్పందం చేసుకొని రైతులకు నష్టం చేస్తుందన్నారు. రాష్ట్ర సివిల్ సప్లై అధికారులు పూర్తిగా అవినీతిలో కురుకుపోయారని తెలిపారు. ఆరు గ్యారంటీల్లో ఒకటైన పంటకు రూ.500 బోనస్ ఇస్తానని ఇప్పుడు సన్నవడ్లకే అనడం కాంగ్రెస్ మాటల గారడీకి నిదర్శనమని వివరించారు. వేసవిలో పండించిన పంటకు 500 తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు పండించిన పంట నష్టానికి కేంద్రం పసల్ భీమా యోజన తీసుకొస్తే గత ప్రభుత్వం, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని అమలు చేయకుండా ఉండటంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. రైతు పెట్టుబడికి భరోసాగా తీసుకొచ్చిన ఫసల్ భీమా యోజనను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో డ్రైనేజ్ అస్తవ్యస్తంగా ఉందని, ఇటీవల కురిసిన మోస్తారు వర్షానికే ప్రజలు ఇబ్బంది పడ్డారని కమిషనర్, అధికారులకు గత కొద్దిరోజుల నుంచి విజ్ఞప్తి చేస్తున్నా ఇంకా డ్రైనేజీ విషయంలో మార్పు లేదని అన్నారు. రాబోయే వర్షాకాలాన్ని గుర్తించి అధికారులు ఇప్పటికైనా నగరంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ తరువాత శాఖల వారిగా సమీక్షా జరిపి అవినీతి ప్రక్షాళన తప్పకుండా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ న్యాలం రాజు, బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు భరత్ భూషణ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్స్ బైకన్ సుధా మధు, ఆకుల శ్రీనివాస్, ఇప్పకాయల కిషోర్, వెల్డింగ్ నారాయణ, ప్రభాకర్, బీజేపీ నాయకులు మఠం పవన్, శిలా శ్రీనివాస్, పవన్ ముందడ, కార్తీక్, కస్తూరి కృష్ణ, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

గిరిరాజ్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

డిగ్రీ కోర్సులలో ప్రవేశం కొరకు విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్లో ఫేస్-1 రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 06 నుంచి 29 వరకు నిర్వహించబడుతుందని, ఫేస్-1 వెబ్ ఆప్షన్లు మే 20 నుంచి 30 వరకు కొనసాగే విషయాన్ని విద్యార్థులు గమనించి తగు ధృవపత్రాలతో దోస్త్ వెబ్‌సైట్‌లో వివిధ డిగ్రీ కోర్సులకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపాల్ జిల్లా దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ పి రామ్మోహన్ రెడ్డి శనివారం

ఒక ప్రకటనలో తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఏ (తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలలో), బీకాం (సిఏ, టాక్సేషన్, బిజినెస్ అనాలిటిక్స్), బిబిఏ, బిబిఏ (లాజిస్టిక్స్), బీసీఏ, బీఎస్సీ (లైఫ్ సైన్స్), బీఎస్సీ (ఫిజికల్ సైన్స్), బీఎస్సి (ఆనర్స్) కంప్యూటర్ సైన్స్, కోర్సులతోపాటు (2024-2025) సంవత్సరం నుండి బీకాం (ఫైనాన్స్), బిఏ (హెచ్ ఈ పి ఎస్) స్పెషల్‌కు 60 సీట్లతో ఈ కోర్సులు కళాశాలలో ప్రారంభమవుతున్నాయని పేర్కొన్నారు.

విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. దోస్త్ వెబ్సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసే క్రమంలో ఏవైనా సందేహాలుంటే దోస్త్ టెక్నికల్ అసిస్టెంట్ ఎన్.శ్రీకాంత్ 9059344379ను సంప్రదించాలని తెలిపారు.